## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



యాదవరెడ్డి(ఫైల్)

నిజాంపేట, అక్టోబర్ 19: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని చల్మెడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గజ్జల యాదవరెడ్డి(45) తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటర్ స్టార్టర్ కాకపోవడంతో స్టార్టర్ వద్ద రిపేరు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి కింద పడిపోయాడు. గమనించిన తోటి రైతులు భాస్కర్‌రెడ్డి, ఇతరులు వెంటనే రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే యాదవరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

### మిరుదొడ్డిలో ఒకరు

మిరుదొడ్డి, అక్టోబర్ 19: కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి టౌన్‌కు చెందిన సత్తు బాల్‌రెడ్డి(55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం వ్యవసాయ బావి వద్ద మొక్కజొన్నలను ఎండబెట్టడానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. కుటుంబ సభ్యులు మొక్కజొన్నలను ఆర బెడుతున్న సమయంలో పొలంలో వరి పంటకు నీరు పెట్టడానికి ఒడ్డు పైనుంచి నడుచుకుంటూ బోరు బావి వద్దకు వెళ్తున్నాడు. అప్పటికే ఒడ్డుపై తెగి పడిఉన్న కరెంట్ వైర్ కాళ్లకు తగలడంతో ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిరుదొడ్డి ఎస్ఐ వై.నరేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మణెమ్మ, ఇద్దరు కుమారులు దినేశ్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ఏరియా దవాఖానకు తరలించారు.

## ఖైదీలపై రివ్యూ కమిటీ సమావేశం

మెదక్ అర్బన్, అక్టోబర్ 19: తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలో ఉన్న ఖైదీల గురించి అండర్ ట్రైల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ, మెదక్ సబ్ జైల్ పర్యవేక్షణాధికారి శ్రీనివాస్, సెంట్రల్ ప్రిసన్ సూపరింటెండెంట్ భరత్, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫజల్ అహ్మద్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేముస్సిసాబేగం, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామశర్మ, తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపుల కేసులో ఏడేండ్ల జైలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 19: ఏడేండ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ వ్యక్తికి సిద్దిపేట జిల్లా కోర్టు ఏడేండ్ల జైలు శిక్ష విధించినట్లు చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన జన్ను రమేశ్ అనే వ్యక్తి ఆగస్టు 8న ఓ బాలికను బర్త్‌డే వేడుకలు ఉన్నాయని చెప్పి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి ఎస్సై నారాయణ విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. జిల్లా కోర్టులో విచారణలో భాగంగా 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి రమేశ్‌కు ఏడేండ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు. నిందితుడికి జైలు శిక్ష పడేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్‌లింగం తన వాదనలు వినిపించినట్లు తెలిపారు. దీనికోసం కోర్టు హెడ్ కానిస్టేబుల్ కిష్టయ్య, కోర్టు లైజనింగ్ ఏఎస్సై స్వామిదాసు, హెడ్‌కానిస్టేబుల్ రాజమల్లు సహకరించినట్లు చెప్పారు. విచారణలో పాల్గొన్న పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను సీపీ శ్వేత అభినందించినట్లు సీఐ తెలిపారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పటాన్‌చెరు, అక్టోబర్ 19: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని రూ ఎడ్యుకేషన్ చైర్మన్ రమేశ్ వర్మాని అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ క్యాంపస్‌లో గీతం స్కూల్ ఆఫ్ యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా యోగా ద్వారా మానసిక ఆరోగ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రమేశ్ వర్మాని హాజరై చక్కటి ఆరోగ్యంకోసం సలహాలు, సూచనలు ఇచ్చారు. యోగా, ధ్యానంతో మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ప్రస్తుత మానవ జీవితకాలం 70ఏళ్లు మాత్రమేనన్నారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పేలవమైన నీటి నాణ్యత, కలుషితమైన గాలి వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. సానుకూల దృక్పథం అవసరం అని, వైఫల్యాలనుంచి నేర్చుకోవడం అందరికీ ముఖ్యమన్నారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తి ధ్యానం, యోగాతో వస్తుందని చెప్పారు.

# బీజేపీకి భారీ షాక్

- బీఆర్ఎస్‌లో చేరిన 400 మంది కమలం నేతలు
- గులాబీమయంగా దౌల్తాబాద్, బీఆర్ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ
- ప్రతిపక్షాలను నమ్మితే కుర్చున్న కొమ్మను నరుక్కున్నట్లే
- అదరించి గెలిపిస్తే ప్రజా సేవకే పునరంకితం
- దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



దౌల్తాబాద్ మండల కేంద్రంలో బైక్ ర్యాలీలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, అక్టోబర్ 19: దౌల్తాబాద్ మండల కేంద్రంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. సుమారు 400 మంది నేతలు కమలానికి గుడ్‌బై చెప్పి దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వీఆర్ఆర్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో సుమారు 400 మంది బీజేపీ కార్యకర్తలు ఎంపీ చేతులమీదుగా గులాబీ కండువా కప్పుకున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరడంతో దౌల్తాబాద్ గులాబీమయంగా మారింది.




బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు, అభిమానులతో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

**మేనిఫెస్టో అద్భుతం**

ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతోపాటు పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరడంతో ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించి మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకువస్తారన్నారు. దుబ్బాకలో బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపిస్తే ఐదేండ్లలో పేదలకు ఏ ఆపద వచ్చినా వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రహిమొద్దీన్, దౌల్తాబాద్ సర్పంచ్ ముత్యంగారి యాదగిరి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పూజితారెడ్డి, వార్డు సభ్యులు జీర్కపల్లి పవన్, కళ్యాణ్, మాశెట్టి నరేశ్‌గుప్తా, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ఉమ్మడి నర్సింహారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నాగరాజు, పబ్బ అశోక్, యూత్ నాయకులు కలీలొద్దీన్, స్వామి, ఇప్ప దయాకర్, గేల్ల శేఖర్ పాల్గొన్నారు.

# ముమ్మరంగా తనిఖీలు



సిద్దిపేట టౌన్: పట్టుబడిన నగదును సీజ్ చేస్తున్న పోలీసులు





నర్సాపూర్: పట్టుకున్న నగదును చూపిస్తున్న సీఐ షేక్‌లాల్ మధార్, ఎస్సైలు శివకుమార్, మహబూబ్

మెదక్ అర్బన్, అక్టోబర్ 19: ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో భాగంగా మెదక్ జిల్లాలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద గురువారం ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బులు, మద్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు మెదక్ ఎస్పీ రోహిణిప్రియదర్శిని తెలిపారు. నర్సాపూర్ పరిధిలోని మల్లన్న టెంపుల్ చెక్‌పోస్ట్ వద్ద రూ.74 లక్షలు, హవేళీఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచమ్మరాల్ చెక్‌పోస్ట్ వద్ద రూ.1,13,700, రూ.87,000, అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లాదుర్గ్ చౌరస్తా వద్ద రూ.80,000, పెద్ద శంకరంపేటలోని గాంధీ చౌక్ వద్ద రూ.లక్ష, హవేళీఘనపూర్ మండల పరిధిలోని బూర్గుపల్లిలోని రాములు కిరాణంలో రూ.1,03,728, 5 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు.

### నర్సాపూర్‌లో రూ.74 లక్షలు

నర్సాపూర్, అక్టోబర్ 19: నర్సాపూర్ పట్టణంలోని మల్లన్న దేవాలయం చెక్‌పోస్ట్ వద్ద సీఐ షేక్‌లాల్ మధార్, నర్సాపూర్ ఎస్సై శివకుమార్, చిలిపిచెడ్ ఎస్సై మహబూబ్ నిర్వహించిన తనిఖీల్లో గురువారం భారీ మొత్తంలో నగదు పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ షేక్‌లాల్ మధార్ మాట్లాడుతూ మెదక్ జిల్లా శంకరంపేట(ఆర్)కు చెందిన నర్రా శ్రీనివాస్ టీఎస్ 09 యూడీ 6567 నంబర్ గల వాహనంలో రూ.74 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. నర్రా శ్రీనివాస్ సీఎంఎస్‌లో ఏటీఎమ్ కస్టోడియన్‌గా పని చేస్తున్నట్లు వెల్లడించారు. సరైన పత్రాలు లేనందున డబ్బును, సదరు వ్యక్తిని ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికల ప్రవర్తనా నియామావళి, నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### సిద్దిపేటలో రూ.7.48 లక్షలు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 19: సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు గోల్డెన్ బేకరి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టణానికి చెందిన చంద్రారెడ్డి కారులో ఎలాంటి రశీదు లేకుండా సుమారు రూ.7.48 లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు.

### అక్కన్నపేటలో రూ.1.90లక్షలు

అక్కన్నపేట, అక్టోబర్ 19: అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి రుజువులు లేకుండా తరలిస్తున్న రూ.1.90 లక్షలు పట్టుకున్నట్లు అక్కన్నపేట ఎస్ఐ వివేక్ తెలిపారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి, నగదును సీజ్ చేసినట్లు చెప్పారు.

### జహీరాబాద్‌లో రూ.27.36 లక్షలు

జహీరాబాద్, అక్టోబర్ 19: జహీరాబాద్ పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా వ్యాన్‌లో ఎలాంటి పత్రులు లేకుండా తరలిస్తున్న రూ.27.36 లక్షలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ.2 శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో డబ్బులు సీజ్ చేసినట్లు చెప్పారు.

### ముస్త్యాల చెక్‌పోస్టు వద్ద..

చేర్యాల, అక్టోబర్ 19 : మండలంలోని ముస్త్యాల చెక్‌పోస్టు వద్ద చేర్యాల పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సైలు భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్ నిత్యం చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ వాహనాన్ని తనిఖీ చేయగా, రూ.1.25లక్షలు, గురువారం తనిఖీ చేసిన వాహనంలో రూ.1.30లక్షలు పట్టుబడ్డాయి. పట్టుబడిన నగదును ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలకు అప్పగించారు.

# వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి జీవితఖైదు

**వివరాలు వెల్లడించిన మెదక్ ఎస్పీ రోహిణిప్రియదర్శిని**

మెదక్ అర్బన్, అక్టోబర్ 19: వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెలువరించిందని మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. గురువారం ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోల్కంపేట గ్రామానికి చెందిన గడ్డి లక్ష్మికి, పోల్కంపేట గ్రామానికి చెందిన గడ్డి హనుమంతుకు రెండేండ్ల క్రితం వివాహం జరిగింది. ఏడాది వయసు గల కొడుకు ఉన్నాడు. హనుమంతుకు లక్ష్మితో వివాహం కాకముందు అందోల్ మండలం రోలపాడు గ్రామానికి చెందిన ఒక అమ్మాయితో వివాహం జరిగింది. ఆమె చనిపోవడంతో రెండో భార్యగా లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులు బాగానే ఉన్నా తర్వాత మద్యానికి, తిరుగుడుకు అలవాటు పడ్డాడు. కొద్ది రోజులు పని కోసం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కూడా ఏ పని చేయకుండా తిరుగుతుండేవాడు. ఈ విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. నాలుగు నెలల క్రితం లక్ష్మి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. హనుమంతు పోల్కంపేటలో ఉంటున్నాడు. 4 ఆగస్టు 2021న హనుమంతు మేనమామ గడ్డి కిష్టయ్య లక్ష్మికి ఫోన్‌చేసి నీ భర్త బూరుగుపల్లి గేటువద్ద అడవిలో బండరాయిపై చనిపోయి ఉన్నాడని చెప్పాడు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా తన భర్త కంటి మీద గాయాలతో రక్తం మడుగులో పడి చనిపోయి ఉన్నాడు. ముందురోజు రాత్రి తన భర్తను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి నిందితుడు పోల్కంపేటకు చెందిన వడ్లపర్తి రాజు ఆచూకీ తెలుసుకొని కోర్టులో హాజరుపర్చారు. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు నివేదించారు. అన్ని పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద నిందితుడైన వడ్లపర్తి రాజుకు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానాను విధించింది. నిందితుడికి శిక్ష పడేలా కోర్టులో వాదనలు వినిపించిన జిల్లా కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫజల్ అహ్మద్‌ను, పోలీసులను ఎస్పీ అభినందించారు.